సాక్షి
ఆదిలాబాద్

శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



మన చిత్రం..'జగమెరిగిన సత్యం'
కుమురంభీం జిల్లాకు చెందిన తిరుపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం జగమెరిగిన సత్యం 18న విడుదల కానుంది. IIలో▸



పండ్ల రసాలకు భలే గిరాకీ
జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతలపానీయాల వైపు ఆసక్తి చూపుతున్నారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
41.1/29.6

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

టీసీ, రికార్డు షీట్ల కోసం చలాన్ చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు టీసీ బుక్‌లు, రికార్డు షీట్‌ల కోసం బ్యాంక్‌లో చలాన్ చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జెడ్పీఎస్ఎస్, కేజీబీవీ, మోడల్, ప్రైమరి స్కూళ్లలో రికార్డు షీట్ కోసం రూ.400, టీసీ బుక్ కోసం రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో రికార్డు షీట్‌ల కోసం రూ.వెయ్యి, టీసీ బుక్ కోసం రూ.1200 చెల్లించాలన్నారు. పాత రికార్డు షీట్, టీసీకి సంబంధించిన మొదటి, చివరి పేజీలను జిరాక్స్ చేసి ఎంఈవో, సంబంధిత ప్రధానోపాధ్యాయుల సంతకంతో డీఈవో కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని, ఈ విషయాన్ని సంబంధిత పాఠశాలల యాజమాన్యాలు గమనించాలని సూచించారు.

'విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాలి'



మాట్లాడుతున్న వెంకట్

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని, తరగతికి ఓ ఉపాధ్యాయుడిని నియమించాలని, విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిష్టన్న, అశోక్, సంఘ బాధ్యులు లక్ష్మణ్‌రావు, సురేఖ, సూర్యకుమార్, శ్రీనివాస్, స్వామి, విలాస్, ఇస్తారి, శివన్న, గణేశ్, శ్రీలత, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ అధికారులకు నోటీసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని జగ్జీవన్‌చౌక్ జెడ్పీ క్వార్టర్‌లో ఇటీవల పేకాట ఆడుతూ పలువురు పట్టుబడ్డారు. దీంతో వన్‌టౌన్ సీఐ ఆర్డీవోకు లేఖ రాశారు. జెడ్పీ క్వార్టర్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, ఎందుకు క్వార్టర్‌ను మూసివేయకూడదో వివరణ ఇవ్వాలని ఆర్డీవో వినోద్ కుమార్ జెడ్పీ అధికారులకు గురువారం నోటీసులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

గవర్నర్‌ను కలిసిన ఎంపీ గోడం నగేశ్



గవర్నర్‌ను సన్మానిస్తున్న ఎంపీ, గిరిజనులు

ఆదిలాబాద్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను ఎంపీ గోడం నగేశ్ గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏజెన్సీ ప్రాంతంలోని సివిల్ కేసుల అధికారం ఐటీడీఏ పీవోలకే ఉంచేలా చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర గిరిజన సలహా మండలి సమావేశం నిర్వహించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఐటీడీఏ గవర్నింగ్ బాడీ సమావేశాలు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తగు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీతో పాటు సార్‌మెడి మెస్రం దుర్గు, పెందూర్ గోపి, పెందూర్ ప్రభాకర్, కొమురం విఠల్‌రావు, అర్క వసంతరావు, గిరి, జమీర్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు జడ్జీల బదిలీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు జడ్జీలను బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్‌లో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న డాక్టర్ ప్రమిళ జైన్ నల్గొండ జిల్లాకు బదిలీ అయ్యారు. అతని స్థానంలో రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న సీఎం రాజ్యలక్ష్మి జిల్లాకు బదిలీపై రానున్నారు. అదేవిధంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న బి.సౌజన్య రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లనున్నారు. ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఇన్‌చార్జిగా సీనియర్ సివిల్ జడ్జికి బాధ్యతలు అప్పగించారు.



ఈ ఫొటోలో కనిపిస్తోంది మావల మండలం వాగాపూర్‌లోని ఇందిరమ్మ ఇలు. ఇప్పటికీ బేస్‌మెంట్ దశ దాటలేదు. ఈ గ్రామానికి 152 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 57 ఇళ్ల నిర్మాణాలను మాత్రమే ప్రారంభించగా అందులో 7 మాత్రమే బెస్‌మెంట్ వరకు పూర్తి చేశారు. ఇంకా 95 ఇళ్లకు పునాదులే తీయలేదు.

అమాత్యా.. భరోసానివ్వండి



ఈ ఫొటోలో కనిపిస్తోంది తాంసి మండలం హస్నాపూర్‌లోని ఇందిరమ్మ ఇల్లు. లబ్ధిదారు ఇప్పటి వరకు పిల్లర్ల వరకు నిర్మించాడు. గ్రామానికి 67 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో ఇప్పటి వరకు కేవలం 26 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. ఇందులో కేవలం ఇద్దరు లబ్ధిదారులు మాత్రమే బెస్‌మెంట్ వరకు పూర్తి చేశారు. మరో 65 మంది ఇంకా నిర్మాణాలను ప్రారంభించనేలేదు.

వేగవంతంపై ప్రత్యేక దృష్టి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నెమ్మదిగా సాగుతున్న మాట వాస్తవమే. వాటిని వేగవంతం చేసేలా ప్రత్యేక దృష్టి సారించాం. పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన గ్రామాల్లో మంజూరైన ఇళ్లకు మార్కవుట్ ఇవ్వడంతో పాటు నిర్మాణ పనులు జరిగేలా అవగాహన కల్పిస్తున్నాం. డీఆర్‌డీఏ ద్వారా ఆర్థికసాయంపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు రాలేదు.

– బసవేశ్వర్, హౌజింగ్ పీడీ

- సిమెంట్, ఇసుక, ఇటుక ధరలు పెరగడంతో పేదల వెనుకడుగు
- ప్రభుత్వ నిధుల విడుదలపైనా సందేహాలు
- జిల్లాలో ముందుకు సాగని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- నేడు జిల్లాకు రానున్న మంత్రి 'పొంగులేటి'

కైలాస్‌నగర్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతికి సంబంధించి ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇంకా పలు మండలాల్లో పూర్తిస్థాయిలో మార్కౌట్లను కూడా ఇవ్వలేదు. ఇళ్ల మంజూరుపై గంపెడాశలు పెట్టుకున్న లబ్ధిదారులు తీరా మంజూరుపత్రాలు చేతికందగా నిర్మాణాలపై మాత్రం అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో నిర్మాణాలు పునాదులు సైతం దాటని దుస్థితి నెలకొంది. లబ్ధిదారులంతా నిరుపేదలే కావడం, ఆర్థిక స్తోమత అంతగా లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. శుక్రవారం జిల్లాకు రానున్న రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ అమాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభయహస్తం కోసం లబ్ధిదారులు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు. తమ గూడుగోడును తీర్చుకునేందుకు చేయూతనందించేలా ఏదైనా హామీ ఇవ్వకపోతారా అని ఆశపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇంటిస్థలం కలిగిన వారికి పైలట్ ప్రాజెక్ట్ కింద మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి ఇళ్లను మంజూరు చేసింది. జిల్లాలోని 17 మండలాలకు గానూ 2010 ఇళ్లు మంజూరు చేస్తూ ఈ ఏడాది జనవరి 26న లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేసింది. ఇంటిని నిర్మించుకున్నవారికి నాలుగు విడతల్లో రూ.5లక్షల ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించింది. ఇంత వరకు బాగానే ఉన్నా ఇళ్ల నిర్మాణాలు మాత్రం ముందుకు సాగడం లేదు. మూడు నెలలవుతున్నా ఇప్పటి వరకు పలు గ్రామాల్లో పునాదులు సైతం తీయని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు కేవలం 76 ఇళ్లు మాత్రమే బెస్‌మెంట్‌స్థాయి వరకు వచ్చాయంటే ఎంత నత్తనడకనసాగుతున్నాయో స్పష్టమవుతోంది. గృహనిర్మాణశాఖ, మండలాధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ నిర్మాణాల్లో మాత్రం పురోగతి కన్పించడం లేదు. కాగా బెస్‌మెంట్ వరకు ఇళ్లు నిర్మించుకున్న వారిలో గురువారం 51 మంది లబ్ధిదారులకు తొలి విడత ఆర్థికసాయం రూ.లక్ష వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లుగా హౌజింగ్ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ చేయూతపై ఆశలు

రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సొంత జిల్లా అయిన ఖమ్మం, నాగర్‌కర్నూల్‌లోని ఇందిరమ్మ లబ్ధిదారులకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా స్వయం సహాయక సంఘాలకు అందించే రుణాలను అందించి ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగానూ ఈ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. అయితే అధికారులకు ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు అందకపోవడంతో జిల్లాలో ఈ విధానం అమలు కావడం లేదు. వెనుకబడిన, నిరుపేదలు ఉన్నటువంటి ఈ జిల్లాకు ప్రాధాన్యతనిచ్చేలా ప్రభుత్వపరంగా చేయూతనందించేలా మంత్రి ఏదైనా హామీ ఇస్తారానే ఆశ వారిలో వ్యక్తమవుతోంది.

మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఇలా..

మండలం	మంజూరైన ఇళ్లు	బేస్‌మెంట్ లెవల్
భీంపూర్	133	18
బేల	83	16
బోథ్	233	09
మావల	152	07
జైనథ్	101	04
తాంసి	67	02
బజార్‌హత్నూర్	134	01
సిరికొండ	157	00
గాదిగూడ	117	00
గుడిహత్నూర్	149	10
ఆదిలాబాద్‌రూరల్	77	04
ఇచ్చోడ	180	01
ఇంద్రవెల్లి	135	00
నార్నూర్	160	01
తలమడుగు	33	03
ఉట్నూర్	99	00

వెనుకడుగు ఎందుకంటే ..

తొలిప్రాధాన్యతగా పూరి గుడిసెలు, మట్టి గోడలు ఉన్నటువంటి వారికి మాత్రమే ఇళ్లు మంజూరు చేశారు. దీంతో ఇందిరమ్మ లబ్ధిదారులంతా నిరుపేదలే కావడం, ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించేంత ఆర్థిక స్తోమత లేకపోవడంతోనే చాలా మంది వెనుకడుగు వేస్తున్నట్లుగా తెలుస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ఇటుక, ఇసుక, సిమెంట్ ధరలు అధికంగా ఉండటం కూడా ఇందుకు కారణమని తెలుస్తోంది. దీంతోపాటు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకుంటే ప్రభుత్వమిచ్చే నిధులు సకాలంలో అందుతాయో.. లేదోననే అనుమానంతోనూ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలకు ముందుకు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటి నిర్మాణం తమకు అదనపు భారంగా మారుతుందనే ఉద్దేశంతో పనులు ప్రారంభించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఫలితంగానే పలు మండలాల్లో ఒక్క ఇంటి నిర్మాణం కూడా ప్రారంభం కానట్లుగా తెలుస్తోంది.

నేడు జిల్లాలో మంత్రులు సీతక్క, పొంగులేటి పర్యటన

కైలాస్‌నగర్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గం గుండా భోరజ్ మండలం పూసాయికి చేరుకుని అక్కడ నిర్వహించే భూభారతి రెవెన్యూ చట్టం అవగాహన సదస్సులో పాల్గొంటారు. సాయంత్రం 4గంటలకు మావల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి పొంగులేటి హైదరాబాద్‌కు వెళ్లనుండగా మంత్రి సీతక్క పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సాయంత్రం 4.45 గంటలకు మావల మండల కేంద్రంలో చిల్డ్రన్‌హోం నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. 5 గంటలకు దస్నాపూర్‌లో ఏర్పాటు చేసిన ఓల్డేజ్ హోంను ప్రారంభిస్తారు. 5.40 గంటలకు తాంసి చేరుకుని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. 6 గంటలకు తాంసి సబ్ సెంటర్, 6.35 గంటలకు తలమడుగు పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం రాత్రి 7.45 గంటలకు జిల్లా కేంద్రంలోని పెన్‌గంగా గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి అక్కడే బస చేయనున్నారు.

మే1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

కైలాస్‌నగర్: మే 1 నుంచి 31 వరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాలలోపు బాలబాలికలు, యువతకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వివిధ క్రీడలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతీరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగునీటి సౌకర్యం కల్పించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు సమయాన్ని వృథా చేయకుండా శిక్షణ శిబిరాలకు హాజరై వారి ప్రతిభను వెలికితీసేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ఆసక్తి గల వారు గూగుల్ ఫాం ద్వారా తమపేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం నిర్వాహకులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఈవో శ్రీనివాసరెడ్డి, డీఐఈవో జాదవ్ గణేశ్, గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

'భూభారతి'తో భూసమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

- కలెక్టర్ రాజర్షి షా

తాంసి: భూభారతి చట్టంతో రైతుల భూసమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు భూహక్కులు భద్రంగా ఉంటాయని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మండల కేంద్రంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయ జయహే తెలంగాణ పాటను ఆలపించిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంపై అందరికీ అవగాహన ఉండాలని సదస్సులు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధరణి స్థానంలో భూమి హక్కుల కోసం భూ భారతి ప్రభుత్వం తీసుకొచ్చినట్లు తెలిపారు. చట్టం విధి విధానాలను రైతులకు వివరించారు. భీంపూర్ మండలంలోని గుంజాల, కరంజి(టి) గ్రామాల్లో అసైన్డ్ భూములను సాగుచేస్తున్న రైతులు పట్టాలు లేవని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా భూభారతి చట్టం ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, తహసీల్దార్ నలందప్రియ, మండల ప్రత్యేకాధికారి కిషన్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ స్వామి, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రోడ్డు పరిశీలన

భీంపూర్ మండలంలోని ధనోర నుంచి వడూర్ గ్రామాల మధ్య గుంతలుగా మారిన అంతర్రాష్ట్ర రోడ్డును కలెక్టర్ పరిశీలించారు. గుత్తేదారుతో ఫోన్‌లో మాట్లాడి నిర్మాణ పనులను చేపట్టాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న నవోదయ పాఠశాల ఏర్పాటుకు భీంపూర్ శివారులో స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వినోద్ కుమార్,సర్వేయర్ మనోజ్, తదితరులు ఉన్నారు.

జిల్లాకు యూనివర్సిటీ తీసుకొచ్చేందుకు కృషి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల పరిధిలో తొమ్మిది జిల్లాలకు యూనివర్సిటీలు ఉండగా ఆదిలాబాద్‌కు మాత్రమే లేదని, జిల్లాకు యూనివర్సిటీ తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ హామీ ఇచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సైన్స్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదువుకునే సమయంలో డిగ్రీ కళాశాలలో ఎన్నికలను చూసిన తర్వాతే నాయకుడిని కావాలన్న ఆలోచన వచ్చిందన్నారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, వైస్ ప్రిన్సిపాల్ జగ్‌రాం, అకాడమిక్ కోఆర్డినేటర్ సంతోష్ కుమార్, లెక్చరర్లు శ్రావణి, జ్యోత్స్న, రమాకాంత్ గౌడ్, చక్రవర్తి, మంజుల, అష్రఫ్ అలీ, రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహం చట్టరీత్యా నేరం



బేలలో కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

బేల: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని డీసీపీయూ సంరక్షణ అధికారి ఎన్.స్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బాల్య వివాహం జరుగుతున్నట్లు 1098కు వచ్చిన సమాచారం మేరకు చైల్డ్ వెల్ఫేర్, డీసీపీయూ, చైల్డ్‌లైన్, షూర్ ఎన్జీవో, పోలీసులతో కలిసి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాలు చేయడం తప్పన్నారు. ఈ చట్టం ప్రకారం రూ.2లక్షల జరిమానా, ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. ఇక్కడ అమ్మాయికి 16, అబ్బాయికి 18 ఏళ్లు మాత్రమే ఉన్నాయని, ఇద్దరూ మైనర్లేనన్నారు. ఇలా పెళ్లి చేయడంతో వారి ఉజ్వల భవిష్యత్ దెబ్బతింటుందన్నారు. బాల్య వివాహం చేయమని ఇరువురి తల్లితండ్రులచే ఒప్పందపత్రం రాయించి తీసుకున్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ పద్మజారాణి, కేస్ వర్కర్ శ్రీకాంత్, షూర్ ఎన్జీవో కోఆర్డినేటర్ వినోద్, ఏఎస్సై లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల కోసం ఆధార్ తప్పనిసరి



రిజిస్టర్ పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం కోసం వచ్చే సమయంలో రోగులు తప్పనిసరిగా ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాధిగ్రస్తుల సమాచారం ఆన్‌లైన్‌లో పొందుపర్చడం జరుగుతుందని, భవిష్యత్‌లో రోగికి సంబంధించిన సేవలను తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. రిమ్స్, సామాజిక ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆధార్ తప్పనిసరి అని పేర్కొన్నారు.

సమయపాలన పాటించాలి

తలమడుగు: వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

తాంసి: వైద్యసిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులతో పాటు ఫార్మసీ గదిలో నిల్వ ఉన్న మందులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సిబ్బంది దీప, నర్మద ఉన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

- పలు ఇళ్లపై ఎగిరిపోయిన పైకప్పులు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, వృక్షాలు



పైకప్పు ఎగిరిపోయిన ఇంట్లో బాధితురాలు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): అకాల వర్షం అతలాకుతలం చేసింది. జైనథ్ మండలంలో బుధవారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో జనాలు భయాందోళనకు గురయ్యారు. ఈదురు గాలులకు జైనథ్ మండలంలోని సిర్సన్న గ్రామంలో దాదాపు పది ఇళ్ల పైకప్పులు లేచి ఎగిరిపడ్డాయి. పూరి గుడిసెలు, రేకుల షెడ్‌లు, పెంకుటిళ్లు దెబ్బతిన్నాయి. మండలంలోని భోరజ్, సిర్సన్న, గూడ గ్రామాల్లో జొన్న పంట నేలకొరిగింది. మామిడి కాయలు రాలిపోయాయి. చేతికొచ్చిన పంట నేలకొరగడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. సిర్సన్నలోని కుర్మ తిరుపతి, లసుందేవి, పెద్ద ఆశన్న, ఆశన్న, అశోక్, తదితరుల ఇళ్ల పైకప్పులు గాలికి ఎగిరిపడ్డాయి. పలు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

గిన్నిస్‌బుక్‌లో జిల్లావాసికి చోటు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన లాండే సురేశ్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కినట్లు ఆ సంస్థకు సంబంధించిన అధికారి ఆనంద్ రాజేందర్ ప్రకటించారు. 2024 డిసెంబర్ 1న 18 దేశాలకు సంబంధించి 1045 మంది ఒకేసారి గంట వ్యవధిలో ఆన్‌లైన్‌లో పియానో వాయించారు. చెన్నైలోని హలాల్ మ్యూజిక్ ఫౌండేషన్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సురేష్ పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఇందుకు గానూ ఈనెల 14న హైదరాబాద్‌లోని మణికొండలో ఆయనకు గిన్నిస్ వరల్డ్ రికార్డుకు సంబంధించిన ప్రతినిధులు సర్టిఫికెట్ అందజేశారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న సురేశ్

క్లుప్తంగా

దాడి కేసులో ఇద్దరు రిమాండ్

జన్నారం: అటవీశాఖ మహిళ బీట్ అధికారి వి ధులకు ఆటంకం కలిగించడమే కాకుండా ఆమెతోపాటు భర్తపై దాడి చేసిన కేసులో ఇద్దరిని గు రువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఈనెల7న జన్నారం మండలం కొత్తపేట సమీపంలో ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా బీట్ అధికారి రుబీనా తలాత్ ఆపింది. ఆమెతోపాటు భర్త అఫ్రోజ్ వెళ్లాడు. నా ట్రాక్టర్‌ను ఆపుతావ అని కవ్వాల్ గ్రామానికి చెందిన రి యాజొద్దీన్, ఎజాజొద్దీన్‌లు బీట్ అధికారి విధులకు ఆటంకం కలిగించాడు. ఆమె భర్తపై దాడి చేయడంతో కేసు నమోదైంది. విచారణ అనంతరం కోర్టులో హాజరుపర్చగా ఇద్దరిని 14 రోజులు రిమాండ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

భార్యపై గొడ్డలి దాడి ఘటనలో భర్తకు..

కోటపల్లి: వివాహేతర సంబంధంపై ప్రశ్నించిన భార్యపై గొడ్డలితో దాడి చేసిన ఘటనలో నిందితుడు భర్తను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన బానోత్ పున్నం తన వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్న భార్య లక్ష్మిని గొడ్డలితో దాడిచేసి గాయపర్చాడు. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

నెన్నెల: మండలంలోని మైలారం మత్తడి వాగు నుంచి అనుమతి లేకుండా బెల్లంపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను జోగాపూర్ వద్ద పట్టుకున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఈ ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశామన్నారు. యజమానులు గడ్డం సాయికుమార్, కొమ్ము రాజన్న, డ్రైవర్లు పసుల రవీందర్, అత్తి సాయిలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

తాంసి: మండలంలోని జామిడికి చెందిన పర్ధాన్ దేవుబాయి ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఒంటరిగా ఉంటున్న ఆమె గురువారం ఉదయం ఇంట్లో దేవుని చిత్రపటం వద్ద దీపం పెట్టి ఉపాధి పనికి కూలీలతో వెళ్లింది. వెలిగించిన దీపం వస్తువులకు అంటుకొని మంటలు వ్యాపించింది. గమనించిన గ్రామస్తులు వెంటనే మోటార్ల ద్వారా నీటిని చల్లి మంటలార్పివేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, దుస్తులు, రూ.20వేల నగదు కాలిపోయాయి. ఇంటి పైకప్పు దెబ్బతింది. దాదాపు రూ.లక్షకు పైగా ఆస్తినష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మానిష్‌రెడ్డి ఘటనస్థలానికి చేరుకుని బాధిత మహిళను పరామర్శించారు. నెలకు సరిపడా సరుకులతోపాటు నగదు అందజేశారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు అశోక్ ఆర్థికసాయం అందజేశాడు.



సినిమా చిత్రీకరణలో నటీనటులు

జగమెరిగిన సత్యం

- చింతలమానెపల్లి మండలం దిందా గ్రామంలో చిత్రీకరణ
- దర్శకుడు, నటులూ స్థానికులు..
- నేడు విడుదల

సినిమా అంటే ఒక క్రేజ్.. రంగులతో కనిపించే సినిమా చాలామందికి కల.. ఇలాంటి ఓ సినిమా మన ప్రాంతంలో రూపుదిద్దుకుంటే ఆ ఆనందం వేరు. ఎలాంటి ప్రాముఖ్యానికి నోచుకోని ఆ గ్రామంలోని వెనుకబడిన పరిస్థితులు, గ్రామస్తుల సహజ అమాయకత్వం ఈనేపథ్యంలో చింతలమానెపల్లి మండలంలోని దిందా గ్రామ కేంద్రంగా రూపుదిద్దుకున్న చిత్రం.. జగమెరిగిన సత్యం..ఈనెల 18న సినిమా విడుదల కానుంది.

చింతలమానెపల్లి: మండలంలోని దిందా.. ఒక మారుమూల గ్రామం.. త్వరలో రంగస్థలానికి పరిచయమవుతోంది. దట్టమైన అటవీ ప్రాంతంలో రవాణా సౌకర్యాలకు, గ్రామం అభివృద్ధికి నోచుకోకుండా ఉంది. జగమెరిగిన సత్యం టైటిల్‌తో విడుదల అవుతున్న చిత్రం 80 శాతం గ్రామంలోనే చిత్రీకరించారు. గ్రామ సమీపంలోని వాగు, చింతలమానెపల్లి మండలం రవీంద్ర నగర్ వారసంత, గూడెం ప్రాణహిత నది వంతెన, పెంచికల్‌పేట్ పెద్దవాగు, కౌటాల మండల కేంద్రం, పక్కనే మహారాష్ట్రలోని అహేరి వద్ద కొన్ని సన్నివేశాలను తెరకెక్కించారు. కౌటాల ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మొదటి సన్నివేశం చిత్రీకరణతో సినిమా ప్రారంభించారు.

1994లో గ్రామీణ పరిస్థితుల నేపథ్యం..

1994లోని గ్రామీణ నేపథ్యం, అప్పటి మనుషుల కట్టుబాట్లు, దర్శకుడి చిన్నతనంలోని అనుభవాలను ఆధారంగా చిత్రం రూపొందింది. ప్రేమ సన్నివేశాలు, భావోద్వేగాలు, సంస్కృతి, సంగీతం ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు దర్శకుడు పాలె తిరుపతి తెలిపారు. ఇందులో పలు సన్నివేశాల్లో దిందా గ్రామస్తులను బ్యాక్‌గ్రౌండ్‌లో నటించేందుకు అవకాశం కల్పించారు. సినిమాలో ఐదు పాటలు ఉండగా బతుకమ్మ పాటను గాయకురాలు మంగ్లీ ఆలపించారు. రాణా దగ్గుబాటి, సాయిపల్లవి నటించిన విరాట పర్వం చిత్రానికి పనిచేసిన సురేష్ బొబ్బిలి ఈచిత్రానికి సంగీత దర్శకత్వం వహించారు. హీరో రవితేజ మేనల్లుడు అవినాష్‌వర్మ, ఆద్యారెడ్డిలను హీరో, హీరోయిన్లుగా తొలిపరిచయం చేశామని, మరో హీరోయిన్‌గా నీలిమ పతకంశెట్టి నటించినట్లు దర్శకుడు తెలిపారు.

జిల్లాలో ఆలస్యంగా విడుదల

జగమెరిగిన సత్యం సినిమా కుమురం భీం జిల్లాలో కాస్త ఆలస్యంగా విడుదల కానుంది. ఈనెల 18 (శుక్రవారం)న మంచిర్యాలలో, తెలంగాణలో 33 థియేటర్లలో విడుదల చేస్తున్నారు. కాగజ్‌నగర్‌లో ఇతర సినిమాలకు ముందుగానే షెడ్యూల్ ఖరారు అయి ఉండడంతో కొన్నిరోజుల అనంతరం విడుదల అవుతుందని సినిమా బృందం తెలిపింది.

దర్శకుడు స్థానికుడే..

దర్శకుడు పాలె తిరుపతి స్వగ్రామం పెంచికల్‌పేట్ మండలం చెడ్వాయి. ఆయనకు చింతలమానెపల్లి మండలంలో బంధువులు ఉండగా వారి ఇంటికి వచ్చేక్రమంలో స్థానిక గ్రామాలపై పరిచయం ఉండగా సినిమా చిత్రీకరణకు కారణమైంది. గ్రామంలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన మంచిర్యాలలో డిగ్రీ పూర్తిచేశారు. సినిమాలపై ఆసక్తితో చిత్రరంగానికి వెళ్లి దర్శకత్వ శాఖలో 8 ఏళ్లు పనిచేశారు. ఈక్రమంలో 'కొరియన్ శీర్షిక అహేరి'పేరుతో లఘు చిత్రం రూపొందించారు. అది సాధించిన విజయం ఇచ్చిన స్ఫూర్తితో మరో నాలుగు లఘు చిత్రాలను రూపొందించగా, ఈ అనుభవంతో జగమెరిగిన సత్యం చిత్రాన్ని తెరకెక్కించారు. కథానాయకుడికి చిన్నతనంలో సోదరుడిగా చింతలమానెపల్లి మండలం గంగాపూర్‌కు చెందిన దండ్రె మణికంఠ(బబ్లూ) బాలనటుడిగా నటించాడు.



నటులకు సీన్ వివరిస్తున్న దర్శకుడు పాలె తిరుపతి

గర్వంగా భావిస్తున్నాం



దిందా గ్రామం పేరు వెండితెరపై వినిపించడం పట్ల మేము గర్వంగా భావిస్తున్నాం. స్థానికంగా చిత్రీకరణ జరగడంతో కొంతమందికి ఉపాధి లభించింది. అటవీ ప్రాంతంలో ఉండే మా గ్రామం అభివృద్ధిలో వెనుకబడి ఉంది. సినిమాతో గ్రామానికి ప్రచారం లభించడం మేము సంతోషంగా ఉన్నాం.

– డోకె రామన్న, దిందా

సహకారం అందించాం



సినిమా చిత్రీకరణకు అనువైన ప్రదేశాల కోసం సోదరుడు అయిన డైరెక్టర్ నన్ను సంప్రదించారు. ఎన్నో ప్రాంతాలను పరిశీలించి దిందా గ్రామాన్ని ఎంపిక చేసుకున్నాం. సినిమా చిత్రీకరణ పూర్తయ్యే వరకు సినిమా బృందానికి నాతో కలిసి గ్రామస్తులు, స్థానిక ప్రజలు సహకారాలు అందించాం. సినిమా విజయవంతం కావాలని కోరుకుంటున్నాం.

– దేవాడి రాజన్న, గంగాపూర్

బాలనటుడిగా మరిచిపోలేనిది



సినిమాలో నటించే అవకాశం రావడం ఒక వరం లాంటిది. నేను 8వ తరగతి చదువుకునే సమయంలో దగ్గరి బంధువు అయిన సినిమా దర్శకుడు అవకాశం కల్పించారు. నటనలో అనుభవం లేకున్నా దర్శకుడు, నటుల సహకారంతో బాలనటుడిగా నటించాను. ఈ అనుభవం మరిచిపోలేనిది.

– దండ్రె మణికంఠ(బబ్లూ), గంగాపూర్

ఓపెన్ 'పది', ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్: ఈ నెల 20నుంచి ప్రారంభమయ్యే ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఉదయం 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంచిర్యాలలో పదో తరగతికి రెండు పరీక్ష కేంద్రాలు, ఇంటర్ పరీక్షలకు మూడు, బెల్లంపల్లిలో పదో తరగతికి ఒకటి, ఇంటర్‌కు రెండు కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులు 666, ఇంటర్ విద్యార్థులు 1192 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు స్టడీ సెంటర్ల ద్వారా పంపిణీ చేస్తామని, విద్యార్థులతోపాటు సిబ్బంది పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి పరికరాలు, సెల్‌ఫోన్లు తీసుకు రావద్దని సూచించారు.

న్యాయవాదిపై దాడి దుర్మార్గపు చర్య



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మంచిర్యాలక్రైం: న్యాయవాదులపై దాడులు దుర్మార్గపు చర్య అని మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు అన్నారు. ఈ నెల 16న సూర్యాపేట జిల్లా న్యాయవాది మాంతపురం కిషోర్‌పై దాడిని ఖండిస్తూ గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భుజంగ్‌రావు, న్యాయవాదులు మాట్లాడుతూ దాడులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తుల అంజనేయులు, దత్తు, గోపతిరవి, శ్రీరాములు, జాడీ తిరుపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విధుల బహిష్కరణ

లక్సెట్టిపేట: న్యాయవాది కిషోర్‌పై దాడిని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు విధులు బహిస్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, ఉపాధ్యక్షులు నళినికాంత్, కోశాధికారి సుమన్ చక్రవర్తి, న్యాయవాదులు భూమరెడ్డి, సురేందర్, అక్కల శ్రీధర్, కిరణ్‌కుమార్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య



పోశెట్టి మృతదేహం

సారంగపూర్: ఒంటరితనం భరించలేక వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కుటుంబీకులు, ఎస్సై తెలిపిన వివరాలు.. మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన తోకల పోశెట్టి(65)కి ఇద్దరు భార్యలు ఉన్నారు. పెద్ద భార్యకు ఇద్దరు కుమార్తెలు, చిన్న భార్యకు ఒక కుమార్తె ఉన్నారు. అయితే గత 20 ఏళ్లుగా కుటుంబానికి దూరంగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. స్థానిక హనుమాన్ ఆలయంలో వంట, బస చేస్తూ కాలం వెళ్లదీశాడు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురికావడంతో తిరిగి ఇంటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులకు ముఖం చూపించలేక, ఒంటరిగా బతకలేక తనలో తానే కుమిలిపోయాడు. ఈక్రమంలో రెండు రోజులుగా పోశెట్టి కనిపించడం లేదని గ్రామస్తులు అనుకుంటున్నారు. గ్రామశివారు ప్రాంతంలోని దడే గుట్ట వద్ద ఒర్రె వైపు పశువులు మేపేందుకు వెళ్లిన వారికి గురువారం పోశెట్టి ఉరేసుకుని కనిపించాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు, ఆయన కుటుంబీకులకు చేరవేశారు. గ్రామస్తులు అందించిన సమాచారంతో ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత..



గడ్డం లావణ్య(ఫైల్)

నెన్నెల: ఆర్థిక ఇబ్బందులతో వివాహిత బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గడ్డం లావణ్య (47), భర్త శంకర్ గౌడ్‌తో కలిసి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట హోటల్ నిర్వహిస్తోంది. హోం లోన్ తీసుకుని ఇల్లు నిర్మించుకున్నారు. హోటల్ పెట్టుబడి కోసం మరికొంత అప్పు చేశారు. వ్యాపారం సరిగ్గా సాగకపోవడంతో అప్పు తీర్చడం కష్టమైంది. కిస్తీలు చెల్లించకపోవడంతో వడ్డీ పెరిగిపోయింది. అప్పులు ఎలా తీర్చాలో అని ప్రతిరోజు బాధపడేదని కుటుంబీకులు చెప్పారు. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున లావణ్య ఇంట్లో కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు చుటూ పక్కల వెతకగా భీరన్నమఠ్రి సమీపంలోని వ్యవసాయ బావి వద్ద ఆమె చెప్పులు లోట కనిపించాయి. అనుమానంతో బావిలో నీటిని మోటార్ల ద్వారా తోడగా అందులో శవమై కనిపించింది. కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం

దహెగాం: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. మండలంలోని కోత్మీర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై కందూరి రాజు కథనం ప్రకారం..దహెగాం మండలం కోత్మీర్ గ్రామానికి చెందిన బొలిశెట్టి వెంకటేశ్‌కు కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లికి చెందిన జ్యోతితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. వెంకటేశ్ సింగరేణికార్మికుడిగా బెల్లంపల్లిలో పనిచేస్తున్నాడు. వీరి కాపురం సాఫీగా సాగింది. ఏడాది క్రితం నుంచి భర్త, అత్త భాగ్య, మామ మొండయ్య అదనపు కట్నం తేవాలని ఆమెను వేధించసాగారు. బుధవారం వేధించడంతో భరించలేని జ్యోతి అందరి ముందే పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబీకులు చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతుంది. జ్యోతి తల్లి పెర్క సుశీల ఫిర్యాదుతో భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి



అశోక్ (ఫైల్)

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన రైతు గాండ్ల అశోక్ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఎస్సై తహసీనొద్దీన్ కథనం ప్రకారం.. అశోక్ (45) గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. చాలాసేపటి వరకు రాకపోవడంతో ఫోన్ చేస్తే ఇంట్లో ఉంది. దీంతో బంధువు అయిన కార్తీక్‌ను పొలం వద్దకు పంపించారు. పొలం ఒడ్డున ఒక చెప్పు, బావిలో మరో చెప్పు కనిపించింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ఈతగాళ్లతో బావిలో వెతకగా మృతదేహం లభించింది. ప్రమాదవశాత్తు బావిలో జారిపడటంతో ఈత రాక అందులో మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య శైలజ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బ్లేడ్‌తో గొంతుకోసి హత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్: బ్లేడ్‌తో ఒకరి గొంతు కోసి హత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని బంగారుగూడలో చోటుచేసుకుంది. ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం..బంగారుగూడకు చెందిన ముద్దంగుల విఠల్, అదేకాలనీలో జాబిర్‌షా ఉంటున్నాడు. గురువారం విఠల్ ఫోన్‌లో ఓ నంబర్ డయల్ చేయాలని జాబిర్ షా అడిగాడు. ఇందుకు విఠల్ నిరాకరించడంతో బ్లేడ్‌తో ఆయన గొంతుకోసి హత్యాయత్నం చేశాడు. తీవ్ర గాయాలైన విఠల్‌ను రిమ్స్‌కు తరలించారు. బాధితుడి భార్య పోచవ్వ ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఆరుగురి బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆరుగురు పాత నేరస్తులను గురువారం తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. వేంపల్లిలో దోపిడీ కేసులో నిందితులైన రమేశ్, అవినాశ్, చందు, సంతోశ్, అశోక్, కృష్ణలను ఏడాదిపాటు షరతులతో కూడిన బైండోవర్ చేశారు.

తల్వార్‌తో ఫొటో దిగిన ఇద్దరిపై కేసు

గుడిహత్నూర్: బర్త్ డే పార్టీలో తల్వార్‌తో ఫొటో దిగి సోషల్ మీడియాలో షేర్ చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ భీమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన యువకులు తరుణ్ గిత్తే, సునీల్ బుధవారం రాత్రి మహంకాళి మందిరం వద్ద జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసిన అనంతరం వేడుకకు హాజరైన మండల కేంద్రానికి చెందిన మిత్రులు నరేశ్, వెంకటి తల్వార్లతో ఫొటోలకు ఫోజు ఇచ్చారు. సోషల్ మీడియాలో షేర్ చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఉండడంతో వీరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆయుధాలతో ఫొటో, వీడియా తీసి సోషల్ మీడియాలో పోస్టులు చేస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని కుమార్‌పేట్‌కు చెందిన తోకల నాగరాజు అశోక్‌రోడ్‌లోని తన పాన్‌షాప్‌లో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన నుంచి 3.65 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.4వేల వరకు ఉంటుందన్నారు. అదేవిధంగా తిర్పెల్లికి చెందిన కరోర శుభం ఇంట్లో మద్యం విక్రయిస్తుండగా ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన నుంచి 3.42 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీటి విలువ రూ.3762 ఉందని వివరించారు.

అసభ్యపదజాలంతో దూషించిన వ్యక్తిపై..

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో కాంగ్రెస్ నాయకులను దూషించిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈనెల 16న వాట్సాప్ గ్రూప్‌లో కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి అసభ్య పదజాలంతో పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన శైలేష్ బొత్కుర్‌వార్ దూషించినట్లు యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. నాయకుల వ్యక్తిత్వాన్ని కించపర్చడంతోపాటు ప్రజలను రెచ్చగొట్టేలా పోస్టు ఉందని తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

జూదరుల అరెస్టు

దండేపల్లి: మండలంలోని నంబాల గ్రామ సమీపంలో గురువారం నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7500 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని జైలుకు తరలిస్తున్న ఎస్సై

బెల్లంపల్లి: చోరీ కేసులో కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ ఎస్సై కె.మహేందర్ కథనం ప్రకారం.. 2022లో టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో దొంగతనం జరిగింది. చోరీ కేసులో నిందితుడిగా ఉన్న పంజాబ్ రాష్ట్రానికి చెందిన హరదీప్‌సింగ్ కొంతకాలం నుంచి కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. నిందితుడి ఆచూకీని కనుగొని పోలీసులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో చాకచక్యంగా పట్టుకుని గురువారం బెల్లంపల్లి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. అనంతరం ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు విక్రయిస్తున్న ఇద్దరు..



దేశీదారు, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

తాంసి: అక్రమంగా మహారాష్ట్ర నుంచి దేశీదారు తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రేండ్ల విజేందర్ తెలిపారు. మండలంలోని లీంగూడ గ్రామానికి చెందిన ఆత్రం దేవ్‌రావు, టేకం బర్కత్‌రావులు మహారాష్ట్ర నుంచి దేశీదారు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పక్కాసమాచారం మేరకు సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి దాడి చేశారు. మద్యం విక్రయిస్తుండగా ఇద్దరిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10వేల విలువ గల 90 ఎమ్ఎల్ కలిగిన 280 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా దేశీదారు, నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది శ్రీధర్, హనుమంత్ పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు..

నేరడిగొండ: మండలంలోని లింగట్లలో కొందరు గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం మేరకు ఇచ్చోడ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫేఖార్ అహ్మద్ సిబ్బందితో గురువారం తనిఖీ నిర్వహించారు. సాబ్లే రంజిత్, సాబ్లే సంజీవ్‌లు గంజాయితో పట్టుబడ్డారు. రంజిత్ వద్ద సుమారు 184 గ్రాముల డ్రై గంజాయి, సంజీవ్ వద్ద 223 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇళ్లపట్టాలు ఇప్పించాలి



ఎమ్మెల్యే వినోద్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి నివాసం ఉంటున్న పుర ప్రజలకు జీవో నెంబర్ 76 ప్రకారం ఇళ్ల పట్టాలు ఇప్పించాలని సీపీఐ నాయకులు కోరారు. గురువారం ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు ఎ. వెంకటస్వామి, బి.పూర్ణిమ, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు ఆడేపు రాజమౌళి, బి.లక్ష్మీనారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల రాజేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

సారంగపూర్: మండలంలోని నిర్మల్-స్వర్ణ రహదారిపై ధని గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మతిస్థిమితం లేని వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని జామ్ గ్రామానికి చెందిన ఎనుగందుల సాగర్ తన బైక్‌పై నిర్మల్ వైపు నుంచి సారంగాపూర్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని మతిస్థిమితం లేని వ్యక్తిని ఢీకొట్టాడు. ప్రమాదంలో గాయపడ్డ అతడు అక్కడికక్కడే మృతి చెందగా సాగర్‌కు, ఆయనతోపాటు బైక్‌పై ఉన్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగ్రాతులను స్థానికులు 108లో నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జూనియర్ కళాశాలల నుంచి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: వచ్చే విద్యా సంవత్సరం 2025-26కు గాను రెప్యూటెడ్(కార్పొరేట్) జూనియర్ కళాశాలల పథకం కోసం జూనియర్ కళాశాలల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, దివ్యాంగులు, మైనారిటీ విద్యార్థులకు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించేందుకు జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి రెప్యూటెడ్ జూనియర్‌కళాశాలలను నూతనంగా ఎంపిక చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



సుల్తాన్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈఈ గోపాల్

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్ నగర్ గ్రామ పంచాయతీలో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం హౌసింగ్ డీఈఈ గోపాల్ పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంతం చేయాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు. ఎంపీడీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శి రవిరాథోడ్ తదితరులు ఉన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలి

దోమకొండ/పెద్దకొడప్‌గల్/ఎల్లారెడ్డి : అర్హులైన పేదలు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం దోమకొండ మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండలంలోని ఆయా గ్రామాల ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు,పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలని పెద్ద కొడప్‌గల్ ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని సముందర్ తండాలో తండా వాసులతో ఆయన మాట్లాడారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చర్యలు తీసుకుంటున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబా అన్నారు. ఎల్లారెడ్డిలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు తదితరులున్నారు.

ధాన్యం దండిగా..

- కొనుగోలు కేంద్రాలకు పోటెత్తుతున్న వడ్లు..
- లక్ష్యానికి మించి సేకరించే అవకాశం



ధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

సుభాష్‌నగర్ : జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వరద పోటెత్తుతోంది. ప్రభుత్వం బోనస్ ప్రకటించడం, దళారులు, వ్యాపారులు యాసంగి ధాన్యం కొనుగోలుకు అనాసక్తి చూపడటంతో సొసైటీలు, ఐకేపీ కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తరలిస్తున్నారు. గత మూడు, నాలుగు సీజన్లలో అధికారులు నిర్దేశించిన లక్ష్యంలో 60 నుంచి 70శాతం మాత్రమే సేకరించారు. కానీ ఈ సీజన్‌లో ప్రభుత్వ లక్ష్యం 8 లక్షల మెట్రిక్ టన్నులకు మించి ధాన్యం సేకరించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

4.20లక్షల ఎకరాల్లో వరిసాగు..

జిల్లాలో 4.20లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, అందులో 3.75లక్షల ఎకరాల్లో సన్నరకాలు, 45వేల ఎకరాల్లో ఇతర రకాలను రైతులు సాగుచేశారు. మొత్తం 11.85 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ప్రభుత్వ కేంద్రాల ద్వారా 8లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏప్రిల్ 5నుంచి కొనుగోళ్లు ఊపందుకోగా, ఇప్పటివరకు 465 కేంద్రాల ద్వారా 2.93లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారు. ఇప్పటివరకు 89,521 మెట్రిక్ టన్నుల ధాన్యం డబ్బులు రూ.207.69 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయి.

3లక్షల మెట్రిక్ టన్నులకు చేరువలో..

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన 15రోజుల్లోనే 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. గత వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ సగటున 25వేల మెట్రిక్ టన్నులు సేకరిస్తున్నారు. ఈనేపథ్యంలో హమాలీలు, గన్నీ బ్యాగుల కొరత, గోదాములు, రైస్‌మిల్లుల్లో నిల్వ సామర్థ్యం, ఇతర అన్ని సమస్యలను అధిగమించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. కాగా బయట మార్కెట్ కంటే మంచి ధర, రూ.500 బోనస్ ఇవ్వడంతో రైతులు ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

బోనస్ ఇస్తుండటంతో..

ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడంతో రైతులు అధిక విస్తీర్ణంలో సన్నరకాలను సాగుచేశారు. బోనస్ లేక ముందు దొడ్డు రకాలను సాగు చేసేవారు. గతంలో నల్గొండ, సూర్యాపేట, హైదరాబాద్, మహారాష్ట్ర, కర్నాటక, తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి ధాన్యం కొనుగోలుచేసేవారు. రూ.500 బోనస్ ప్రకటనతో వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్, కోటగిరి, తదితర ప్రాంతాల్లోని సొసైటీలు, ఐకేపీ కేంద్రాలు ధాన్యంతో కళకళలాడుతున్నాయి. ఎక్కడ చూసినా ధాన్యం రాశులు దర్శనమిస్తున్నాయి. సొసైటీలకు ధాన్యం పోటెత్తుతుండటంతో తలకు మించిన భారంగా మారిందని ఆయా సొసైటీల ప్రతినిధులు వాపోతున్నారు.

చివరి గింజ వరకు సేకరిస్తాం..



రైతులు పండించిన చివరిగింజ వరకూ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తాం. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు అధిగమిస్తూ సజావుగా ముందుకు సాగుతున్నాం. కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు చేపట్టాం. కొనుగోళ్లపై ప్రతినిత్యం సమీక్షిస్తున్నాం. త్వరలోనే బోనస్ డబ్బులు కూడా జమ అవుతాయి.

-కిరణ్‌కుమార్, అదనపు కలెక్టర్, నిజామాబాద్

ఓరి దేవుడా.. ఎంత కష్టమొచ్చింది!

- తిండి పెట్టలేక కూతుళ్లను కొట్టిన నిస్సహాయ తల్లి
- అక్కున చేర్చుకున్న మీడియేషన్ ప్రతినిధులు
- బాలసదన్‌కు పిల్లల తరలింపు
- స్వధార్ హోమ్‌లో తల్లికి ఆశ్రయం



బోధన్‌లోని స్వధార్ హోంలో లతను చేర్పిస్తున్న మీడియేషన్ సెంటర్, చైల్డ్ కమిటీ ప్రతినిధులు

బోధన్: ఆకలితో అలమటిస్తున్న కన్నబిడ్డల కడుపు నింపలేక ఓ నిస్సహాయ తల్లి నడిరోడ్డుపై పిల్లలపై చేయిచేసుకున్న ఘటన అందరినీ కలిచివేసింది. ఈ నెల 14న బోధన్ పట్టణంలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన లత (35) ఎనిమిదేళ్ల క్రితం అదే మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు కూతుర్లు హరిప్రియ(6), లహరిక(4) జన్మించారు. లతతోపాటు పిల్లలను వదిలేసి భర్త మరో వివాహం చేసుకొని వెళ్లిపోయాడు. దీంతో లత స్వగ్రామంలోనే దినసరి కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కూతుర్లను పోషించుకుంటూ కాలం వెళ్లదీస్తుండగా, పోతంగల్ మండలం కల్లూరు గ్రామానికి చెందిన మరో వ్యక్తి పరిచయమయ్యాడు. లతతోపాటు పిల్లలను బాగా చూసుకుంటానని నమ్మబలికి మార్చి 1న వారిని వెంట తీసుకెళ్లాడు. బాసర, భైంసా ప్రాంతాల్లో 15 రోజుల పాటు తిప్పి.. బాసర సరస్వతి దేవి ఆలయం వద్ద వదిలేసి వెళ్లాడు. దిక్కుతోచని స్థితిలో లత ఇద్దరు కూతుర్లతో ఆలయం వద్దనే ఆశ్రయం పొందింది. 15 రోజుల క్రితం ఉపాధి కోసం బోధన్‌కు వచ్చి ఓ వాటర్ ప్లాంట్‌లో దినసరి కూలీగా పనిచేస్తూ పిల్లలను పోషించుకుంటోంది. కారణం ఏదో కానీ, వాటర్‌ప్లాంట్ నుంచి బయటకు వచ్చింది. నిరాశ్రయురాలై , ఉపాధి కోల్పోయి ఇద్దరు కూతుర్లు ఆకలితో ఆలమటిస్తుంటే కడుపు నిండా తిండి పెట్టలేని పరిస్థితి ఎదురుకావడంతో మనోవేదనతో కుమిలిపోయింది. ఈ నెల 14న పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆకలితో అలమటిస్తున్న ఇద్దరు కూతుర్లకు తిండిపెట్టలేక తల్లి కొట్టడంతో పిల్లలిద్దరూ కన్నీరుమున్నీరయ్యారు. స్థానికులు గుర్తించి మీడియేషన్ సెంటర్ పారాలీగల్ వాలంటీర్లకు సమాచారం ఇచ్చారు. పారాలీగల్, చైల్డ్ కమిటీ ప్రతినిధులు పద్మాసింగ్, రమణ తల్లీకూతుర్లను వెంట తీసుకెళ్లి స్థానిక స్వధార్ హోమ్‌లో చేర్పించారు. గురువారం బోధన్‌కు వచ్చిన చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులకు హరిప్రియ, లహరికలను అప్పగించగా, వారు నిజామాబాద్‌లోని బాలసదన్‌లో చేర్పించారు. తల్లి లతకు స్వధార్ హోంలోనే ఆశ్రయం కల్పించారు.

మంత్రి పర్యటనలో గలాటాపై ఆరా!

- నిందితులను గుర్తిస్తున్న పోలీసు శాఖ
- చట్టరీత్యా చర్యలకు సిద్ధం
- ఇప్పటికే కొందరిపై కేసులు నమోదు

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు భీమ్‌గల్ పర్యటన సందర్భంగా అల్లరి సృష్టించిన వారిపై పోలీసుశాఖ సీరియస్‌గా దృష్టి సారించింది. ఉద్దేశపూర్వకంగానే గలాటా చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పోలీసులపై ఇసుక చల్లడంతో గత్యంతరం లేక లాఠీచార్జి చేయాల్సి వచ్చినట్లు ఓ అధికారి చెప్పారు. నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల అనుమతి పొందినట్లు తెలుస్తోంది. ఘర్షణ వాతావారణం సృష్టించేందుకు 30 నుంచి 40 మంది ఉదయం నుంచి వేచి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అందులో కొందరు మద్యం మత్తులో ఉండడంతో ఎంత నచ్చజెప్పినా వినకుండా పోలీసులపైకి దాడికి ప్రయత్నించారని అధికారులు భావిస్తున్నారు. భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ నేతృత్వంలో నిందితులను గుర్తించేందుకు పోలీసు బృంది తీసిన వీడియోలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే కొందరిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

సుప్రీంకోర్టును ఆశ్రయించిన షబ్బీర్ అలీ

- వక్ఫ్ సవరణ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ..



సుప్రీంకోర్టు ముందు న్యాయవాదులతో షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్ : వక్ఫ్ బోర్డు సవరణ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సుప్రీంకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు గురువారం ఆయన సాక్షితో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తరపున రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఈ కేసును ప్రముఖ న్యాయవాదులు సల్మాన్, ఖుర్షీద్ బృందం వాదిస్తున్నట్లు చెప్పారు. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్లపై విచారణ చేపట్టిందన్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సైతం కేవియెట్ దాఖలు చేసిందన్నారు. ఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని సుప్రీంకోర్టుకు తెలిపినట్లు ఆయన చెప్పారు. సుప్రీంకోర్టుపై పూర్తి స్థాయి నమ్మకం ఉందని తప్పకుండా న్యాయం జరుగుతుందని షబ్బీర్ అలీ ఆశాభావం వ్యక్తం చేశారు.

మాచారెడ్డి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

మాచారెడ్డి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రాజేశ్ చంద్ర గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. స్టేషన్ రికార్డులు పెండింగులో లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామ పోలీసు అధికారులకు కేటాయించిన గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. పోలీసు అధికారి, సిబ్బంది ఠాణాకు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, నైట్ బీట్ పెట్రోలింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రూరల్ సీఐ రామన్, సిబ్బంది ఉన్నారు.

ఆపరేషన్ డాగ్.. అభాసుపాలు

- వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ ప్రక్రియలో..
- మొదట స్వచ్ఛంద సంస్థకు అప్పగింత
- ఆ తర్వాత ఖరీదు ఎక్కువైందని వారికి స్వస్తి
- నిజామాబాద్, నిర్మల్ నుంచి తర్ఫీదు వ్యక్తుల ద్వారా..
- లక్ష్యం ఆలస్యం కావడంతో మళ్లీ తర్జనభర్జన



వీధి కుక్కలను పడుతున్న దృశ్యం

సాక్షి,ఆదిలాబాద్: ఆపరేషన్ డాగ్.. వీధి కుక్కలకు స్టెరిలైజేషన్.. జంతు జనన, నియంత్రణ నియమాలను అనుసరించి సంతానోత్పత్తి కలగకుండా శస్త్ర చికిత్స చేయడమే దీని అర్థం. ఆదిలాబాద్ పట్టణంలో వీధికుక్కల ద్వారా సంతానోత్పత్తిని నిరోధించేందుకు చేపట్టిన ప్రక్రియ పూర్తిగా అభాసు పాలైంది. మొదట స్వచ్ఛంద సంస్థకు ఈ ప్రక్రియను అప్పగించారు. ఆ తర్వాత ధర అధికంగా ఉందని వారికి స్వస్తి పలికారు. ఆ తర్వాత ఇతర ప్రాంతాల్లో కుక్కలను పట్టడంలో తర్ఫీదు పొందిన వ్యక్తులను తీసుకొచ్చి తక్కువ ధరకు వారితో వీధికుక్కలను పట్టించారు. ఇక సంతానోత్పత్తి కలగకుండా పశుసంవర్ధక శాఖ అధికారుల ద్వారా శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఇలా ధర సగానికంటే తక్కువ వ్యయం అవుతుందని చెప్పుకొచ్చారు. ఇలా చేపట్టడంలో ప్రక్రియ పూర్తిగా ఆలస్యమవుతుందని ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు. మళ్లీ స్వచ్ఛంద సంస్థకు ఈ ప్రక్రియ అప్పగిద్దామని ఆలోచిస్తున్నారు.

ఒక్కో కుక్కకు రూ.1600 చొప్పున..

ఆదిలాబాద్ పట్టణంలో వీధి కుక్కలు 5వేలకు పైగా ఉన్నాయి. వీటి ద్వారా సంతానోత్పత్తి పెరగకుండా వాటికి శస్త్ర చికిత్స నిర్వహించాలని రెండేళ్ల కిందట నిర్ణయించారు. మొదట ఈ ప్రక్రియను స్వచ్ఛంద సంస్థల ద్వారా నిర్వహించాలని తలచి ఎనిమల్ వెల్ఫేర్ సొసైటీ అనే సంస్థకు టెండర్ అప్పగించారు. అందులో భాగంగా వారు వీధి కుక్కలను పట్టడం, జంతు సంరక్షణ కేంద్రాలకు తరలించడం , శస్త్ర చికిత్స నిర్వహించడం, ఔషదాలు, ఆహారం, పూర్తిగా కోలుకునే వరకు కొన్నిరోజులు సంరక్షించి తిరిగి ఎక్కడినుంచి పట్టుకొచ్చామో అక్కడే వాటిని వదిలేయాలి. ఇది ఆ టెండర్ పొందిన స్వచ్ఛంద సంస్థ చేపట్టాల్సిన ప్రక్రియ. దీనికోసం ఆ సంస్థకు ఒక్కో కుక్కకు రూ.1600 చొప్పున ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా ఆ స్వచ్ఛంద సంస్థ 1300 వీధి కుక్కలను పట్టుకొని ఈ ప్రక్రియను చేపట్టింది. వారితో అక్కడికే ప్రక్రియ నిలిపివేశారు. ఆ తర్వాత శునకాలను పట్టుకోవడంలో తర్ఫీదు పొందిన నిజామాబాద్, నిర్మల్ ప్రాంతాలకు చెందిన వ్యక్తులను నియమించుకున్నారు. వారు కేవలం వీధి కుక్కలను పట్టుకోవడం వరకే పరిమితం. అందుకోసం వారికి ఒక్కో కుక్కకు రూ.500 చొప్పున ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఇలా 500 వరకు వీధి కుక్కలను పట్టుకున్నట్లు, స్టెరిలైజేషన్ నిర్వహించినట్లు మున్సిపాలిటీ అధికారులు చెబుతున్నారు. తద్వారా భారీగా మిగులు చేకూరిందని చెప్పుకొచ్చారు.

విమర్శలు ఇలా..

స్వచ్ఛంద సంస్థ పేరిట, ఆ తర్వాత తర్ఫీదు వ్యక్తుల పేరిట వీధికుక్కలను పట్టుకోవడం వరకు సబబుగా జరిగినప్పటికీ, ఆ తర్వాత వాటిని హత మార్చారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ సమీపంలో జేసీబీ ద్వారా తవ్వకాలు జరిపి వాటి కళేబరాలను పూడ్చిపెట్టారనే ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా వీధి కుక్కలను ఎక్కడినుంచి పట్టుకొస్తారో.. ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్కడే వదిలిపెట్టాలి. పలు చోట్ల శునకాలను తిరిగి కాలనీలో వదిలిపెట్టకపోవడంతో పలువురు ఈ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఈ వ్యవహారంలో ఇటు సంస్థ, అటు బల్దియా అధికారులు లక్షల రూపాయలు స్వాహా చేశారనే అపవాదు వ్యక్తమవుతోంది.

మళ్లీ పునరాలోచన..

పట్టణంలో 5వేలకు పైగా వీధికుక్కలు ఉంటే ఇప్పటివరకు 1800 వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు పూర్తి చేసినట్లు మున్సిపాలిటీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే రెండేళ్లలో లక్ష్యానికి సగం కూడా చేరుకోకపోవడంతో విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో మళ్లీ బల్దియా అధికారులు పునరాలోచనలో పడ్డారు. స్వచ్ఛంద సంస్థకే ఈ ప్రక్రియను అప్పగించి పూర్తి చేయాలని అనుకుంటున్నారు.

తప్పుడు ప్రచారం..



వీధి కుక్కలను ఎక్కడినుంచైతే పట్టుకున్నామో అక్కడే వదిలిపెట్టే వరకు నిబంధనల మేరకు ఏమేం చేయాలో ఆవిధంగానే చేపట్టాం. శస్త్ర చికిత్సల తర్వాత పూర్తి సంరక్షణ తీసుకొని అవి కోలుకున్న తర్వాత తీసుకువచ్చిన చోటే వదిలిపెట్టాం. దీనికి సంబంధించి ఫొటోలు, వీడియోలు ఉన్నాయి. కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తూ మాపై నిందలు మోపుతున్నారు.

– నరేందర్, శానిటరి ఇన్‌స్పెక్టర్, ఆదిలాబాద్ మున్సిపాలిటీ

అయితే మున్సిపాలిటీ అధికారులు దీన్ని కొట్టిపడేస్తున్నారు.

'సిరాల'.. ఎందుకిలా?



సిరాల ప్రాజెక్ట్ కింద ఎండుతున్న వరి పొలం



నీరందక ఎండుతున్న మొక్కజొన్న

- రెండేళ్ల కింద తెగిన ప్రాజెక్ట్ కట్ట
- కొనసా...గుతున్న మరమ్మతు
- వట్టిపోయిన బోర్లు, బావులు
- ప్రశ్నార్థంగా ఆయకట్టు సాగు

భైంసా/భైంసారూరల్: అన్నపూర్ణగా పిలవబడే సిరాల ప్రాజెక్ట్ రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు తెగగా, ఇక్కడి రైతుల పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. 1902లో నైజాం కాలంలో నిర్మించిన ఈ ప్రాజెక్ట్ 2023 వరకు సాగునీరు అందించింది. ప్రాజెక్ట్ తెగడంతోనే ఆయకట్టు రైతులు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. రెండేళ్లుగా ప్రాజెక్ట్ మరమ్మతులు చేపడుతున్నా నేటికీ పూర్తి కాలేదు. గతేడాది కొందరు బోర్లు వేసుకోగా ఈసారి అవి వట్టిపోయి సాగు భూములు బీళ్లుగా మారుతున్నాయి. రెండేళ్లలో ఆయకట్టు కింద 130కిపైగా బోర్లు వేసుకోగా ప్రస్తుతం 10 మాత్రమే నీటిని అందిస్తున్నాయి. వరి పొలాలు, మొక్కజొన్న చేన్లు ఎండుతున్నాయి. ఆయకట్టు కింది సిరాల, ఇలేగాం, ఉమ్రి, బోల్సా, బోరిగాం, బెల్తరోడ, మాంజ్రి తదితర గ్రామాల్లో బోరుబావుల న్నీ వట్టిపోయాయి. 230 ఎకరాల్లో చివరి దశ పంటలకు నీరు అందని పరిస్థితి ఉంది. పొట్టదశలోని వరికి నీటి తడి అందడంలేదు. దీంతో రైతులంతా ఆందోళనకు గురవుతున్నారు. సిరాల ప్రాజెక్టుకు కొద్ది దూరంలోనే బాపూజీ మహారాజ్ భూములు కౌలుకు తీసుకున్న రైతులు ఎప్పటిలాగే వరి సాగు చేశారు. రెండేళ్లుగా ఈ పొలంలోని బోరు నుంచి నీరు బాగానే వచ్చేది. 20 రోజుల్లో బోరు వట్టిపోగా కౌలు రైతులు సాగుచేసిన వరి పొలం ఎండిపోతోంది.

వరి ఎండుతోంది



సిరాల ప్రాజెక్ట్ కింద ఉన్న వరి పొలం ఎండుతోంది. నాటువేసిన నుంచి నీరందించిన బోరు వట్టిపోయింది. కొత్త బోరువేసినా నీళ్లు పడడంలేదు. ఈసారి వరి పంటకు నీరు అందడం కష్టమే. కళ్ల ముందే పొలం బీటలువారింది.

– వీరేశ్, రైతు

పంట నష్టపోతున్నం



సిరాల ప్రాజెక్ట్ తెగిపోగా ఈ ప్రాంత రైతులందరికీ కష్టాలు మొదలైనయ్. ప్రస్తుతం పంటలన్నీ ఎండుతున్నయ్. రెండేళ్లుగా ఇవే కష్టాలు ఎదుర్కొంటున్నం. భూగర్భజలాలు తగ్గినయ్. పొట్టదశలోని వరికి నీటి తడి ఇవ్వలేకపోతున్నం.

– పాహేశ్, రైతు

ఆదివాసీలను అసెంబ్లీకి పంపడమే లక్ష్యం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్, విశారదన్ మహరాజ్



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీలను అసెంబ్లీకి పంపించడంతో పాటు వారికి భూ పంపిణీ చేయించడమే 'మా భూమి పాదయాత్ర' లక్ష్యమని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్, డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కుమురంభీం కాలనీకి చేరుకున్న పాదయాత్రకు ఆదివాసీ గిరిజనులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికి ఆదివాసీలకు ఎంతో సంబంధం ఉందని, ప్రకృతిని కాపాడుతూ భూమిని రక్షిస్తున్న ఆదివాసీలకు గుంట భూమి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, మహిళా అధ్యక్షురాలు గోడం రేణుకా, డివిజన్ అధ్యక్షురాలు సోయం లలిత, జిల్లా ఉపాధ్యక్షురాలు ఇందిర, డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఇన్‌చార్జి అన్నెల లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్, బహుజన ఉద్యమ నాయకుడు గద్దల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం



మహేశ్ (ఫైల్)

ఖానాపూర్: ఉరివేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన గురువారం ఖానాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ సీహెచ్.అజయ్, ఇంచార్జీ ఎస్సై శ్రావణి తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన బాలేకర్ మహేశ్(35) స్థానిక లారీ అడ్డాలో మటన్ దుకాణాన్ని నిర్వహిస్తుంటాడని తెలిపారు. ఓ వివాహితతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని, ఆమె వివాహేతర సంబంధం వద్దనడంతో మనస్తాపం చెందాడని తెలిపారు. గురువారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకున్నాడని తెలిపారు. మృతుడి తండ్రి గంగేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జైలర్ నిర్లక్ష్యంతో రిమాండ్ ఖైదీ మృతి!

- కుటుంబీకుల ఆరోపణ
- గ్రామస్తులతో కలిసి పోలీసుస్టేషన్ ఎదుట భైఠాయింపు
- న్యాయం చేయాలని డిమాండ్



సిందే సాయినాథ్ (ఫైల్)



పోలీసుస్టేషన్ ఎదుట గ్రామస్తులు, కుటుంబీకులు

ముధోల్: ఆదిలాబాద్ జైలు లో రిమాండ్ ఖైదీగా ఉన్న ముధోల్ మండల కేంద్రానికి చెందిన సిందే సాయినాథ్(32) మృతిచెందాడు. తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గురువారం ముధోల్ పోలీసుస్టేషన్ ఎదుట భైఠాయించారు. దీనికి జైలర్ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గత ఫిబ్రవరిలో ఒక కేసు విషయంలో సిందే సాయినాథ్‌తోపాటు ముగ్గురిని ఆది లాబాద్ జైలుకు తరలించారు. అప్పటి నుంచి జైలు కు వెళ్లి చూడడానికి జైలర్ అనుమతి ఇవ్వలేదు. నాలుగు సార్లు బెయిల్‌కు దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేయలేదని, మృతిచెందిన తర్వాత బెయిల్ మంజూరు చేశారు. సాయినాథ్ ఆరోగ్యం బాగాలేదని రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ జైలు నుంచి సమాచారం రాగానే హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి వెళ్లాం. అప్పుడు సిందే సాయినాథ్ కాళ్లను గొలుసులతో కట్టేసి ఉంచారు. పూర్తి స్పృహలో లేకుండా దీనావస్థలో ఉన్నాడు. జైలుకు వెళ్లే ముందు పూర్తి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి జైలుకు ఆరోగ్యంగా వెళ్లిన వ్యక్తి చనిపోవడం ఏమిటని ప్రశ్నించారు. జైలర్, సిబ్బంది నిర్లక్ష్య కారణంగా సాయినాథ్ మృతిచెందారని కుటుంబీకులు ఆరోపించారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఆర్థికంగా ఆదుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, భైఠాయించిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులతో సీఐ మల్లేశ్, ఎస్సై సంజీవ్ మాట్లాడారు. జైలులో రిమాండ్ ఖైదీ మృతి చెందడంపై చట్టపరంగా విచారణ చేయిస్తామనడంతో వారు ఆందోళనను విరమించారు.